క్లుప్తంగా

ఘనంగా వైఎస్ భారతి పుట్టినరోజు వేడుకలు



వైఎస్ భారతి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ మహిళా ప్రతినిధులు

నల్లజర్ల: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం వద్ద శనివారం రాత్రి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. నవరత్నాల కార్యక్రమ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నాగనారాయణమూర్తి సమక్షంలో భారతి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో నల్లజర్ల మండలం, శింగరాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, ద్వారకాతిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యురాలు ఆచంట అనసూయ తదితరులు పాల్గొన్నట్టు పావనీ కుమారి ఆదివారం తెలిపారు.

తోగుమ్మిలో ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలందిస్తున్న అల్లూరి బాపినీడు హెల్త్ క్లినిక్ వైద్యులు

కొవ్వూరు: స్థానిక అల్లూరి బాపినీడు హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని తోగుమ్మి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు లోహిత్ జైన్, ఆదిత్య విశ్వాసేలు సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. తోగుమ్మి ఉప సర్పంచ్ ఉప్పులూరి సూరిబాబు, నాయకులు ఉప్పులూరి రాజబాబు, అవంతీ ఫీడ్స్ డీజీఎం డి.రామకృష్ణ, ఏజీఎం వై.రామచంద్రం, సీనియర్ మేనేజర్ వి.అమ్మిరాజు చౌదరి, పర్సనల్ మేనేజర్ ఎస్.తాతాజీ శిబిరంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచదార బస్తా అపహరించిన వ్యక్తి అరెస్ట్

నిడదవోలు రూరల్: బెల్లం బట్టీలో నుంచి పంచదార బస్తాను అపహరించి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. మండలంలోని కోరుపల్లికి చెందిన రేలంగి రామకృష్ణకు చెందిన బెల్లం బట్టీ వద్ద నిల్వ ఉంచిన పంచదార బస్తాను శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన కాసగాని నాగబాబు అపహరించి బైక్‌పై తరలిస్తుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రైతు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగబాబును అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

నల్లజర్ల: అనంతపల్లి – నల్లజర్ల మార్గంలో స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపల్లికి చెందిన చెప్పుల సుధాకర్, అతని భార్య మహేశ్వరి గాయపడ్డారు. బైక్‌పై నల్లజర్ల వెళుతున్న ఆ దంపతులను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సుధాకర్‌కు 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు సమాచారం. స్వల్ప గాయాలలో బయట పడిన మహేశ్వరిని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయ్యప్ప మాల ధరించిన సుధాకర్ శబరిమల వెళ్లి, శనివారమే ఇంటికి తిరిగి వచ్చాడు. గర్భవతి అయిన భార్యను పరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా మార్గ మధ్యంలో ఈ ప్రమాదం బారిన పడ్డారు.

ఆరు కాసుల బంగారు ఆభరణాల చోరీ

కొవ్వూరు: మండలంలోని సీతంపేట గ్రామంలోని సీహెచ్ వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 6న ఆయన ఇంటికి తాళాలు వేసుకుని, కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన ఆరు కాసులు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు సత్యనారాయణ గుర్తించారు. గత నాలుగు రోజుల్లో ఈ చోరీ ఎప్పుడు జరిగిందో స్పష్టంగా తెలియడం లేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.

విజ్జేశ్వరంలో ఏడుగురి అరెస్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం వద్ద గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను లారీలో లోడింగ్ చేస్తున్న అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. ఇసుక లారీని కూడా స్వాధీనపరుచుకున్నామని ఎస్సై చెప్పారు.

వనాల్లో జనాల కోలాహలం

- కార్తిక మాసంలోని చివరి ఆదివారం కావడంతో వన సమారాధనల సందడి
- వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహణ
- ఉదయం నుంచి ఆడిపాడిన పిల్లలు, పెద్దలు
- పాల్గొన్న మంత్రి వనిత, ఇతర ప్రజాప్రతినిధులు



కొవ్వూరు కాపు వన సమారాధనలో హోం మంత్రి తానేటి వనితను సత్కరిస్తున్న కాపు సంఘ నాయకులు



నిడదవోలు మండలం సింగవరంలో కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కొవ్వూరు: మన సంస్కృతి ప్రకారం కార్తిక మాసంలో పూజలు, వన సమారాధనలు పుణ్యఫలమని, వాటిలో తనను కూడా భాగస్వామిని చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కార్తిక మాసంలోని చివరి ఆదివారం కావడంతో కొవ్వూరు డివిజన్‌లోని వివిధ గ్రామాల్లోని వనాలన్నీ జనాలతో కళకళలాడాయి. ఎక్కడ చూసినా వన సమారాధనలతో పిల్లలు, పెద్దలూ అనే బేధం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకూ అందరూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కొవ్వూరు పట్టణ పరిధిలో వేర్వేరుగా నిర్వహించిన కాపు, గౌడ,శెట్టిబలిజ సంఘాల కార్తిక వన సమారాధనల్లో మంత్రి పాల్గొన్నారు. పెరుమళ్ల ఉమామహేశ్వరరావు తోటలో నిర్వహించిన కొవ్వూరు నియోజకవర్గ స్థాయి కాపు వన సమారాధ నకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ఇటీవల కొవ్వూరు పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాపు కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ఎప్పుడూ తాను కాపులకు అండగా ఉంటూ అవసరమైన తోడ్పాటు అందిస్తానన్నారు. ముందుగా కార్తిక దామోదరునికి పూజలు చేశారు. కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి వనిత తిలకించారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, కాపు సంఘం నాయకుడు, రిటైర్డు డీఎస్పీ రావూరి సత్యనారాయణ, మైపాల రాంబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, తోట రామకృష్ణ, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, కొయ్యల భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గండ్రోతు సురేంద్ర, జుట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ శివార్లలోని దుద్దుపూడి గార్డెన్స్‌లో నిర్వహించిన గౌడ,శెట్టి బలిజ సంఘం వన సమారాధనలో కూడా మంత్రి వనిత పాల్గొన్నారు.గౌడ సంఘం రాష్ట్ర నాయకులు తాతా కృష్ణారావు, వేంద్ర సూరిబాబు, మారిశెట్టి రాజు తదితరులు ఏర్పాట్లు చేశారు.

ఉండ్రాజవరం మండలంలో..

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి, తాడిపర్రు, కె.సావరం గ్రామాల్లో కార్తిక వన సమారాధనలు జరిగాయి. తాడిపర్రులో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం ఉసిరిచెట్టు వద్ద పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఈ వన సమారాధనకు వెలగదుర్రు సర్పంచ్ సాగి పద్మావతి 50 కేజీల బియ్యం, పండితుడు ఎస్.ప్రసాద్ రూ.25 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు కలగ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణ సంఘం సభ్యులు సీతారామ చంద్రశేఖర్, పొట్లచెరువు రాధాకృష్ణ, మాగాపు సుబ్బారావు, కోడూరి చలపతిరావు పాల్గొన్నారు. పాలంగిలో కరికాలబత్తుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్క శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచ్, వార్డ్ సభ్యులను సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. అలాగే కాల్దారిలో ఆంజనేయస్వామి ఆలయ 50వ వార్షికోత్సవం సందర్భంగా అఖండ అన్న సమారాధన జరిగింది.

విశ్వబ్రాహ్మణులు పురోగతి సాధించాలి

నల్లజర్ల: రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా విశ్వబ్రాహ్మణులు పురోగతి సాధించాలని అందుకు సంఘ సభ్యులందరూ సమష్టిగా కృషి చేయాలని ఆ సంఘ మండల శాఖ అధ్యక్షుడు దాసు కనాచార్యులు కోరారు. కంచి కామాక్షి విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దూబచర్లలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ ఐక్యత లేకపోవడం వల్లే సామాజికంగా ఎదగ లేకపోతున్నామన్నారు. అన్ని రంగాలలో ముఖ్యంగా విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వీరబ్రహ్మేంద్రస్వామికి, కామాక్షి అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళలకు, పిల్లలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పుల్లూరి శ్రీకృష్ణ సూర్యచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామాచార్యులు, కార్యదర్శి రాయలవరపు నాగసతీష్, కోశాధికారి యుగంధర్, ఉపాధ్యక్షుడు మంచి సత్యనారాయణ, మండల కార్పెంటర్స్ సంఘాధ్యక్షుడు రాయలవరపు వెంకట పోతురాజు, బల్లంకి చిట్టిబాబు, విస్సాకోటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని పార్వతీ సహిత విశ్వేశ్వరస్వామి వారి ఆలయం వద్ద కార్తిక అన్న సమారాధన నిర్వహించారు. మహాకుంభాభిషేకం ముగింపు, కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అర్చకుడు కొతవరపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు వేల మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రక్కిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి, గజ్జరం తదితర గ్రామాల నుంచి భక్తులు అన్నసమారాధనకు హాజరయ్యారు

చాగల్లు: మండలంలో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. ఊనగట్ల శివారు అమ్మికుంట పొలాల్లో ఆర్య వైశ్య సంఘం, శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు జరిగాయి. ఆయా సామాజిక వర్గాల వారు కుటుంబ సమేతంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పిల్లలకు, మహిళలకు పలురకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు కూడా అందజేశారు.



పాలంగిలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరిని సత్కరిస్తున్న కరికాల బత్తుల సంఘం మహిళలు



దూబచర్లలో విశ్వ బ్రాహ్మణుల వన సమారాధనలో ప్రసంగిస్తున్న నాయకులు



చాగల్లు మండలంలో చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఐక్యతను పెంచుతాయి

నిడదవోలు రూరల్: కార్తిక వన సమారాధనలు ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సింగవరంలో కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం, తాడిమళ్లలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని అగ్ర కులాల్లోని పేదలకు కూడా జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పార్టీ నాయకులు కాపకాయల సూర్యనారాయణ, కౌన్సిలర్లు, కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గణపతి సెంటర్లో ఆక్రమణల తొలగింపు



నిడదవోలు గణపతి సెంటర్లో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

నిడదవోలు: పట్టణంలోని కీలకమైన గణపతి సెంటర్ విస్తరణ పనుల్లో భాగంగా మున్సిపల్ స్థలాల్లో నిర్మించుకున్న పలు అక్రమ కట్టడాలు, షాపులను జేసీబీల సహాయంతో తొలగించారు. మున్సిపల్, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు ఆదివారం ఉదయమే ఇక్కడకు చేరుకొని ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పాటి మీద సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ, ×రుడా× నిధులు రూ.4.50 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ, డ్రైనేజీల నిర్మాణాలను పూర్తి చేశారు. గణపతి సెంటర్ అభివృద్ధిలో భాగంగా ఇక్కడ నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు, పైప్ లైన్, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు వాటర్ ఫౌంటెన్ నిర్మిస్తారు. కాగా గణపతి సెంటర్లో మున్సిపాలిటీకి చెందిన 25 సెంట్ల స్థలాన్ని కొందరు కొన్నేళ్లుగా ఆక్రమించుకుని షాపులు, ఇళ్లు నిర్మించుకున్నారు. ఖాళీ చేయాల్సిందిగా వారందరికీ ముందుగానే నోటీసులు జారీ చేసిన మున్సిపల్ అధికారులు ఆదివారం రెండు జేసీబీల సాయంతో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు.

ప్రతి ఒక్కరికీ ఆశ్రయం కల్పిస్తున్నాం

ఈ సెంటర్లోని మున్సిపల్ స్థలంలో ఉంటున్న వారందరికీ అండగా ఉంటామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. ఇక్కడ నివాసం ఉంటున్న 10 కుటుంబాలకూ ఇప్పటికే జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు. మిగిలిన వారికి కూడా స్థలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. బాధితులకు ఏ సమస్య వచ్చినా ముందుండి దానిని పరిష్కరించి వారికి న్యాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, టౌన్ ప్లానింగ్ అధికారి సుజాత, ఆర్ఐ విజయేంద్ర, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సాయం అందజేత



కొవ్వూరులో ఆర్థిక సాయం, రేషన్ పొందిన తుపాను బాధితులతో హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: తుపాను ప్రభావంతో కొవ్వూరు మండలంలో గృహాలు దెబ్బతిన్న ఎనిమిది బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన ఆర్థిక సాయాన్ని, నిత్యావసర సరకులను హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా పంపిణీ చేశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున మంత్రి నగదు అందజేశారు. అలాగే ప్రతి కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, కందిపప్పు, వంట నూనె అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, నాయకులు మల్లిపూడి రాజేష్, పామెర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: వరద ముంపు బాధిత కుటుంబాలకు ఆదివారం దేవరపల్లి గ్రామ సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యావసరాలు అందజేశారు. స్థానిక యూనియన్ బ్యాంకు రోడ్డులో ఎనిమిది గృహాలు ముంపునకు గురయ్యాయి. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో చొప్పున కంది పప్పు, ఉల్లిపాయలు, వంట నూనెతో కూడిన కిట్లను ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్ఐ వెంకటేష్ మాట్లాడుతూ తుపానుకు మండలంలో 23 గృహాలు పాక్షికంగాను, మరో 11 గృహాలు పూర్తిగాను దెబ్బతిన్నాయన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసరాలు, పూర్తిగా దెబ్బతిన్న కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి రాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రతినిధి గడా జగదీష్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్ పాల్గొన్నారు.

48 కుటుంబాలకు..

నల్లజర్ల: మండలంలోని రెండు గ్రామాల పరిధిలోని 48 మంది తుపాను బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నిత్యాసరాలు సమకూర్చింది. శింగరాజుపాలెంలోని 26 కుటుంబాలకు, మారెళ్లమూడిలోని 22 కుటుంబాలకు శనివారం రాత్రి ఈ నిత్యావసరాల కిట్లను ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీ కుమారి అందజేశారు. ఈ కిట్లలో బియ్యం, కందిపప్పు, వంట నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ఉన్నాయి. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుడు పరమేశ్వరరావు ఉన్నారు.



దేవరపల్లిలో బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న ఎంపీపీ దుర్గారావు

సుందరేశ్వరునికి ఘటాభిషేకం



కొవ్వూరు సుందరేశ్వర స్వామి సహస్ర ఘటాభిషేకానికి గోదావరి జలాలు తీసుకు వెళుతున్న భక్తులు



అన్నవరప్పాడు విశ్వేశ్వర స్వామి గుడిలోని నందీశ్వరునికి అభిషేకం

కొవ్వూరు: పవిత్ర గోదావరి జలాలతో స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. వందలాది భక్తులు ఈ పుణ్యకార్యంలో పాల్గొన్నారు. గోదావరి జలాలను బిందెలతో తీసుకు వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. గోష్పాద క్షేత్ర వేద శాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు వేద సభ, పండిత సత్కారాలు జరిగాయి. కార్తిక మాసంలోని చివరి సోమవారం నాడు విభూతితో సుందరేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.108 శివ లింగాలకు విభూతితో అభిషేకం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికీ శివ లింగాలు ఇస్తామని, అభిషేకం అనంతరం, వాటిని ఇంటికి తీసుకెళ్లవచ్చని తెలిపారు.

అన్నవరప్పాడులో నందీశ్వరునికి అభిషేకం

పెరవలి: అన్నవరప్పాడు గ్రామంలోని ఉమా విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలోని నందీశ్వరునికి ఆదివారం సాయంత్రం అభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ అభిషేకానికి అవసరమైన పూజా సామగ్రిని శివ స్వాములు, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు సమకూర్చారు. ముందుగా గణపతికి విశేష పూజలు చేశారు. అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, దొంగరావిపాలెం, ఖండవల్లి, పిట్టల వేమవరం గ్రామాల నుంచి సుమారు 500 మంది భక్తులు అభిషేకంలో పాల్గొన్నారు.

108లో ప్రసవం



తల్లీబిడ్డలతో 108 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు

నిడదవోలు: 108 వాహనంలో శనివారం అర్ధరాత్రి ఓ గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఆర్.అనూష అనే నిండు గర్భిణికి పురిటినొప్పులు ప్రారంభం కావడంతో నిడదవోలు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ ఆ గ్రామం వెళ్లి గర్భిణిని ఎక్కించుకుని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకువెళుతోంది. మార్గ మధ్యలో సమిశ్రగూడెం చేరుకునే సరికి అనూషకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దాంతో 108 సిబ్బంది వాహనాన్ని రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఈఎంటీ అశోక్ చాకచక్యంగా గర్భిణికి పురుడు పోయడంతో ఆ తల్లి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. వారిని దగ్గరలోని నిడదవోలు ఆసుపత్రిలో జాయిన్ చేశారు.

సౌత్ ఇండియా కరాటే చాంపియన్ ఆంధ్రా జట్టు

- దేవరపల్లిలో పోటీల నిర్వహణ
- 400 మంది క్రీడాకారుల హాజరు



ఓవరాల్ కరాటే చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు

దేవరపల్లి: సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలను ఆదివారం దేవరపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. స్థానిక కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు గెలుచుకున్నారు. కటా, కుమిటీ విభాగాల్లో క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. టోర్నమెంట్‌ను కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ కేతా శ్రీనివాస్ ప్రారంభించారు. స్థానిక పరమేశ బయోటెక్ పరిశ్రమ జీఎం శివప్రసాద్, ఏపీ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పేరం రవీంద్రనాథ్, జక్కంశెట్టి శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు చాంపియన్‌షిప్ కప్ అందజేశారు.

17న అయోధ్య రాముని అక్షతల పంపిణీ



అయోధ్య నుంచి వచ్చిన అక్షతల స్పర్శ కార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు

నల్లజర్ల: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షతల కలశాన్ని ఆదివారం నల్లజర్లలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉంచి స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ అక్షతలను గ్రామ గ్రామానా ఈ నెల 17న భక్తులకు పంపిణీ చేస్తారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మండల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్ తెలిపారు. నల్లజర్లకు మాయలేడి తాతారావు, ఆవపాడుకు మద్దూరి విష్ణుమూర్తిలను ఎంపిక చేసినట్టు చెప్పారు. మండల కార్యదర్శిగా బదిరెడ్డి నాగేశ్వరరావును నియమించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గోరక్ష ప్రముఖ్ ఎం.సుబ్బారాయుడు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రముఖ్ ఉప్పలపాటి మాధవ రావు, మద్దు ప్రసాద్, మైనం బ్రహ్మయ్య, సవలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రాములోరి కల్యాణానికి..

గోపాలపురం: రానున్న శ్రీరామ నవమికి భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవంలో ఉపయోగించే తలంబ్రాల కోసం ఆదివారం మండలంలోని చిట్యాల గ్రామంలో వరి కంకులు సేకరించారు. ఈ గ్రామ రైతు ఒకరు తన పొలంలోని 10 సెంట్ల విస్తీర్ణంలోని వరి కంకులను తలంబ్రాల కోసం కొవ్వూరు రామభక్త బృందానికి అందజేశారు. ఇక్కడ సేకరించిన వరి కంకుల నుంచి తొలుత ధాన్యపు గింజలను వేరు చేస్తారు. అనతరం ఒకొక్క గింజను గోటితో వలిచి బియ్యపు గింజలను తయారు చేసి స్వామివారి కల్యాణంలో తలంబ్రాల కోసం భద్రాచలం తీసుకువెళ్లి అందజేస్తామని కొవ్వూరు రామభక్త బృందం తెలిపింది. సుమారు 10 వేల మంది భక్తులకు సరిపడా తలంబ్రాలను తీసుకు వెళతామని ఆ బృందం సభ్యులు చెప్పారు.

తూరల ఏర్పాటుతో తీరిన ముురుగు సమస్య

తాళ్లపూడి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ప్రక్కిలంక గ్రామంలోని ఇళ్ల వద్ద నీరు నిలిచిపోయింది. దాంతో ఆదివారం నాడు తాళ్లపూడి వైపు ఆర్ అండ్ బీ రోడ్డును తవ్వి నీరు వెళ్లడానికి మార్గం చేశారు. అలాగే ప్రక్కిలంక నుంచి తాళ్లపూడి వైపు వెళ్లే డ్రెయిన్‌లోకి రెండు చోట్ల సిమెంట్ తూరలు ఏర్పాటు చేశారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు దగ్గరుంచి జేసీబీతో పనులు చేయించారు. దాంతో ప్రక్కిలంకకు మురుగు సమస్య తీరింది.

రోటరీ సేవలు అభినందనీయం

- గవర్నర్ సుబ్బారావు
- విస్తృతంగా పలు సేవా కార్యక్రమాలు



హృదయాలయానికి పరుపులు అందిస్తున్న రోటరీ గవర్నర్ సుబ్బారావు, క్లబ్ సభ్యులు

నిడదవోలు: రోటరీ క్లబ్బులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్– 3020 గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు కొనియాడారు. రోటరీ గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోను, మండలంలోను పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గడ్డి బజార్‌లోని ఆంజనేయ స్వామి గుడికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెయిన్ గేట్‌ను, గాంధీనగర్ ఆయుర్వేద ఆసుపత్రిలో రూ.1.5 లక్షలతో నిర్మించిన పంచకర్మ చికిత్స థియేటర్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఆయుర్వేద హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల వనాన్ని ప్రారంభించారు.అలాగే నిడదవోలు మండలం డి. ముప్పవరంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. అదే గ్రామంలో అభివృద్ధి చేసిన స్వర్గీయ వరైె చంద్రరావు, సత్యవతి రోటరీ కైలాస భూమిని గ్రామస్తులకు అంకితం చేశారు. పట్టణంలోని లెప్రసీ కాలనీలో 35 కుటుంబాలకు బియ్యం, దుప్పట్లు, మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రానికి (హృదయాలయం) నిత్యావసరాలు, పరుపులు పంపిణీ చేశారు. మండలంలోని కాటకోటేశ్వరంలో 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తాడిమళ్ల గ్రామంలో వినికిడి లోపం గల వారికి వినికిడి పరికరాలు, రైతులకు గునపాలు, పారలు పంపిణీ చేశారు. తాడిమళ్ల, బ్రాహ్మణగూడెం గ్రామాల హైస్కూళ్లలో విద్యార్థులతో ఇంటరాక్ట్ క్లబ్బులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ల రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ పాలదాసు శ్రీనివాస్, కారింకి సాయిబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.